క్లుప్తంగా

షిర్డీసాయి సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో షిర్డీసాయి సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం మందిర ఆవరణలో జరిగింది. ఆలయం సేవా కమిటీ సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గౌరవాధ్యక్షుడిగా వి.సుబ్బరాజు, అధ్యక్షుడిగా వై.వీర్రాజు, కార్యదర్శిగా బొండా శ్రీనివాసరావు, క్యాషియర్‌గా బండి నరేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా కె.అచ్చిబాబు, బి.శ్రీనివాస్‌ను సభ్యులు ఎన్నిక చేశారు.

శ్రావ్యంగా గాత్ర కచేరి



గాత్ర కచేరి చేస్తున్న రమ్య, కిరణ్మయి బృందం

మద్దిలపాలెం: పర.. సంగీత బృందం 8వ వార్షికోత్సవాన్ని ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి గాయత్రి విద్యా పరిషత్ ఆచార్యుడు పి.సోమరాజు, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రమ్య, కిరణ్మయి బృందం గాత్ర కచేరి శ్రావ్యానందకరంగా సాగింది.

వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బీచ్‌రోడ్డు: ఎంవీపీ డబుల్ రోడ్డులోని శంకర్ కార్ గ్యారేజ్ వద్ద గల శ్రీ హెల్త్ కేర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. సుగర్, గుండె జబ్బులతో బాధపడుతున్న పలువురు రోగులు వైద్య సేవలు పొందారన్నారు. శిబిరంలో రోగులకు రక్త పరీక్షలు చేసి, ఈసీజీ ఉచితంగా తీయడంతోపాటు మందులు అందజేశామన్నారు. సుగర్, గుండె జబ్బులపై అవగాహన కల్పించి.. వాటిపై సలహాలిచ్చి, సందేహాలను నివృత్తి చేశామని వైద్యులు చెప్పారు.

ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ హెచ్‌ఎంగా రాధాకుమారి



గౌరవ వందనం స్వీకరిస్తున్న హెచ్‌ఎం రాధాకుమారి

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా జయంతి రాధాకుమారి ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడ హెచ్‌ఎంగా పని చేస్తున్న లక్ష్మీనరస మధురానగర్ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రాధాకుమారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లచే హెచ్‌ఎం గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ కమిటీ చైర్మన్ అప్పలరాజు, సభ్యులు అమరాన వెంకటరమణ పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో పారిశుధ్య పనుల విభాగం



హౌస్ కీపింగ్ పనులను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోరా, జ్యోత్స్న బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో అధునాతన, పరిశుభ్రమైన మెకానికల్ క్లీనింగ్ సిస్టంను వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా వైద్యాధికారులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత కోసం మొదటిసారిగా ఈ పనులను ప్రైవేటు సంస్థ (సింగూరి నాగేశ్వర్రావు ఏజెన్సీకి మూడేళ్ల కాలవ్యవధితో కాంట్రాక్టు అప్పగించారు. సుశిక్షితులైన 39 మంది సిబ్బంది అధునాతర మెకానికల్ సిస్టంతో నిరంతరం ఆస్పత్రిని వీరు పరిశుభ్రంగా ఉంచుతారు. ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ. శాంతారాం, చీఫ్ ఇంజినీర్ (కన్‌స్ట్రక్షన్) డి. శ్రీనివాసరావు, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ప్రవీణ్ భటి, రైల్వే ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





సబ్‌మెరైన్ మ్యూజియం వద్ద నుంచి పాండురంగాపురం వరకు తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలు

అందాల తీరం.. అధ్వాన భరితం



సముద్రంలోకి ప్రవహిస్తున్న మురుగు నీరు



- బీచ్‌లో సందర్శకులకు స్వాగతం పలుకుతున్న వ్యర్థాలు
- శుభ్రత, పర్యవేక్షణ కరవు

ఏయూక్యాంపస్: సాగర తీరం దుర్గంధ భరితంగా మారుతోంది. సరదాగా కాసేపు తీరంలో సేదతీరాలని వచ్చే నగరవాసులు, పర్యాటకులకు అధ్వాన పరిసరాలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రస్తుతం సాగర తీరంలోని ఇసుక తిన్నెలపై నాలుగడుగులు వేస్తే నలభై వ్యర్థాల కుప్పలు పలకరిస్తాయి. వీటిని తొలగించే వ్యవస్థలు, శుభ్రం చేసే సిబ్బంది, వీటి కోసం ఏర్పాటు చేసిన యంత్రాలు, పర్యవేక్షించే అధికారుల జాడ మాత్రం కనిపించడం లేదు.

అధికారుల దృష్టి అక్కడే..

ఆర్కే బీచ్ వద్ద ప్రతి రోజూ నిర్ణీత సమయాల్లో ఇసుకలో వ్యర్థాలను సేకరించడానికి యంత్రాలను వినియోగిస్తున్నారు. ఎక్కువ మంది పర్యాటకులు వస్తారనే ఉద్దేశంలో ఈ ప్రాంతంపై మాత్రమే అధికారులు దృష్టి సారించి పనిచేస్తున్నారు. ఇతర ప్రాంతాల వైపు కన్నెత్తి చూడటం లేదు. సాధారణంగా ఆర్కే బీచ్ నుంచి పాండురంగాపురం, కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, విక్టరీ ఎట్ సీ తదితర చోట్ల బీచ్‌లు, కోకో ఎరీనాలు ఉన్న ప్రాంతాలకు నిత్యం వందలాది మంది సందర్శకులు వస్తుంటారు. సాగర తీరంలో కూర్చుని, సముద్ర కెరటాలను వీక్షిస్తూ అనిర్వచనీయ అనుభూతిని సొంతం చేసుకోవాలని ఆశిస్తుంటారు. వాస్తవాలను పరిశీలిస్తే ఇక్కడ పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉంటున్నాయి.

తీరం పొడవునా వ్యర్థాలే..

తీరం పొడవునా, కర్రలు, ప్లాస్టిక్ సీసాలు, ఫుట్ ప్యాకింగ్ చేసే డబ్బాలు, నీళ్ల సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇవి గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వైఎంసీఏ ఎదురుగా ఉన్న ఆల్ ఎబిలిటీ పార్క్ నుంచి వీఎంఆర్‌డీఏ స్మార్ట్ సిటీ పార్క్ వద్దనున్న లైట్ హౌస్‌కు వెళ్లే మార్గంలో వందల సంఖ్యలో మద్యం సీసాలు నిత్యం కనిపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో విరిగిన గాజు సీసా ముక్కలు ఇసుకలో కలిసిపోతున్నాయి. స్వేచ్ఛగా చెప్పులు లేకుండా విశాఖ సముద్ర తీరంలో నడిచే పరిస్థితి కొరవడింది. అంతర్జాతీయ నగరంగా పేరు తెచ్చుకుంటున్న విశాఖకు తలమానికంగా సాగర తీరం నిలుస్తోంది. దీనిని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం ఎంతో అవసరం. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు నగరవాసులు, సందర్శకులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీకి పూర్తి పట్టున్న 23వ వార్డులో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణరెడ్డి నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. వార్డుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు సాధించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని చెప్పారు. వార్డులో ఏకాభిప్రాయంతో వార్డు, బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటీలో పదవులు కేటాయించేటప్పుడు 23వ వార్డులోని అన్ని బూత్‌ల సభ్యులు ఉండేలా చూసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో సభ్యుల కష్టానికి తగిన ప్రతిఫలం ఉండేలా తాను బాధ్యత తీసుకుంటానని మొల్లి అప్పారావు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు, నాయకులు రమణరెడ్డి, పెద్దరెడ్డి, ఈశ్వర రెడ్డి, పోలిరెడ్డి, గణేష్‌రెడ్డి, కొండారెడ్డి, రమణ రెడ్డి, బోర రాము రెడ్డి, రమణ, శశికళ, అరుణ, శ్రీనివాస్ రెడ్డి, నానాజీ, చంటి, దుర్గ, వెంకటలక్ష్మి, రమణమ్మ, త్రినాథ్‌రెడ్డి, శ్రీనివాసరావు, పిలక మధుసూదన్‌రెడ్డి, పిలక సంపత్, నర్సింగ్‌రావు, సూరిబాబు, యమల రమణ, బోయ రమణ, పిడింట్ల నరసింగరావు, కుమార్‌రెడ్డి, గుడ్ల నరసింగరావు, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొల్లి అప్పారావుకు ఆత్మీయ సత్కారం



వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావును సత్కరిస్తున్న పార్టీ 16వ వార్డు శ్రేణులు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావుకు 16వ వార్డులోని పార్టీ శ్రేణులు ఆత్మీయ సత్కారం చేశారు. సీతమ్మధారలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం ఆయనకు గజమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ తూర్పులో పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. పార్టీ ఏ కార్యక్రమం నిర్వహించిన అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో 16వ వార్డు నుంచి 400 మందికి పైగా కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. 16వ వార్డులో అన్ని బూత్‌ల సభ్యులు ఉండేలా చూసుకోవాలని, భవిష్యత్తులో అందరి కష్టానికి తగిన ప్రతిఫలం ఉండేలా తాను బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పీలా ప్రేమ్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు పులగం కొండారెడ్డి, పోలరత్నం, పల్లా శ్రీనివాస్, కోయిలాడ రామలింగేశ్వరరావు, బొట్టా శివ, బొచ్చ లక్ష్మణరావు, వేములవలస అప్పారావు, పులగం శ్రీనివాసరెడ్డి, సుబ్బారావు, దళాయి అప్పారావు, వేణుగోపాలరెడ్డి, వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విరిగిన బెంచీలే గతి



ఓపెన్ జిమ్ పక్కన విరిగిన సిమెంట్ బెంచీ



ఏనుగు బొమ్మల వెనుక శిథిలమైన బెంచీ

ఏయూక్యాంపస్: సాగర తీరంలో ఉదయం వేళలో వాకింగ్‌కు వచ్చే వారికి ఉపయుక్తంగా నిలిచే సిమెంట్ బెంచీలు శిథిలయ్యాయి. విశాఖ మ్యూజియం ఎదురుగా ఉన్న ఏనుగు బొమ్మలకు సమీపంలోను, ఓపెన్ జిమ్ పరికరాల పక్కన ఉన్న సిమెంట్ బెంచీలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ఇవి కూర్చోవడానికి ఎంతమాత్రం అనువుగా లేవు. నిత్యం ఇక్కడి ఓపెన్ జిమ్‌కు వందలాది మంది వ్యాయామం చేయడానికి నగరవాసులు వస్తుంటారు. దాని పక్కనే ఉన్న ఏనుగు బొమ్మలను చూడటానికి, ఫొటోలు తీసుకోవడానికి స్థానికులు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. వీరు కాసేపు కూర్చుని సేదతీరడానికి ఈ బెంచీలు ఎంతో అనువుగా ఉంటాయి. ప్రస్తుతం ఇవి విరిగిపోయి, ఇనుప ఊసలు బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా మారాయి. వీటిని తొలగించి, కొత్త బెంచీలు ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం

సీతంపేట: శ్రీ శరవణ భవ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం శంకరమఠంలో వల్లీ దేవసేవ సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభించి మండపారాధన, కల్యాణమూర్తులకు స్నపన తిరుమంజనం, అనంతరం కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా శ్రీ శరవణ భవ సంస్థాన్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ కల్యాణం ద్వారా అపమృతు దోషాలను పోగొట్టి జీవితంలో యువతకు మంచి నడవడికను, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని వేడుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు సంస్థ ద్వారా 85 కల్యాణ మహోత్సవాలు నిర్వహించామని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, కార్యదర్శి అచ్యుతరామయ్య, డాక్టర్ విద్యాసుధ పాల్గొన్నారు.

చెత్తమయంగా చినవాల్తేరు



చినవాల్తేరు ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తను తింటున్న గేదె



రోడ్డు మీద పేరుకుపోయిన చెత్త

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 21వ వార్డులోని చినవాల్తేరు చెత్తమయంగా మారింది. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా చెత్తే దర్శనమిస్తోంది. ప్రధాన రహదారుల మీదే పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోతోంది. ప్రతి రోజు ఉదయం వచ్చి చెత్తను తరలించాల్సిన జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగా రోడ్లు చెత్తతో నిండిపోతున్నాయి. రెండు రోజులుగా పారిశుధ్య కార్మికులు ఈ ప్రాంతంలోని చెత్తను తొలగించటం లేదని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు మీద నుంచి వెళ్లాలంటే దుర్వాసనతో ముక్కు మూసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. మరోపక్క రోడ్ల మీద పేరుకుపోయిన చెత్తను పశువులు తిని అనారోగ్యానికి గురవుతున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు స్పందించి సకాలంలో చెత్త తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తొలి రోజే తిప్పలు

- రేషన్ డిపోల వద్ద నరకుల పంపిణీ ప్రారంభం
- సర్వర్ మొరాయింపుతో తప్పని అవస్థలు
- గంటల తరబడి క్యూలో లబ్ధిదారుల నిరీక్షణ
- డిపోలకు మళ్లీ రప్పించడంపై పెదవి విరుపు



12వ వార్డులో రేషన్ డిపో వద్ద క్యూలో లబ్ధిదారులు



శివాజీపాలెంలోని 204 రేషన్ డిపో వద్ద క్యూ కట్టిన లబ్ధిదారులు



13వ వార్డులోని 358 రేషన్ డిపోలో సర్వర్ పనిచేయకపోవడంతో నిరీక్షిస్తున్న జనం



13వ వార్డులో రేషన్ డిపో వద్ద ఫొటో కోసం టీడీపీ మహిళా కార్యకర్తల వాగ్వాదం, వారి వెనుక ఇరుక్కుపోయిన కార్పొరేటర్



అప్పుఘర్‌లోని డిపో వద్ద రాత్రి 8 గంటల సమయంలో రేషన్ కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



ఎంవీపీ సెక్టార్-2లోని డిపో వద్ద వేలిముద్రలు వేసేందుకు ఇబ్బంది పడుతున్న మహిళలు

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం రేషన్ డిపోల వద్ద సరకుల పంపిణీని ప్రారంభించిన తొలి రోజే లబ్ధిదారులకు తిప్పలు తప్పలేదు. ఆదివారం నుంచి డిపోల వద్ద రేషన్ ఇవ్వడం మళ్లీ మొదలైంది. దీంతో ప్రజలు దూర ప్రాంతాల్లో ఉన్న డిపోలకు వెళ్లక తప్పడం లేదు. రేషన్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకు వచ్చి ప్రజలకు రేషన్ సరకులు అందించేవారు. ఇప్పుడా సౌకర్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచి రేషన్ డిపోలకే సరకుల పంపిణీని మళ్లీ అప్పగించింది. రేషన్ కార్డుదారులను డిపోల వద్దకే తిరిగి రప్పించింది.

నియోజకవర్గంలోని రేషన్ డిపోల వద్ద సరకుల పంపిణీని ప్రారంభించడంతో లబ్ధిదారులు వాటిని వెతుక్కుంటూ వెళ్లాల్సి వచ్చింది. మొదటి రోజు కావడంతో ఎక్కువ మందికి సమాచారం తెలియక అంతంత మాత్రంగా జనం డిపోలకు వెళ్లి సరకులు తీసుకున్నారు. ఐదేళ్ల తర్వాత సరకుల కోసం రేషన్ డిపోలకు వెళ్లడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇంటి వద్దకే వచ్చిన బండి వద్ద కొద్ది క్షణాల్లోనే రేషన్ సరకులు తీసుకునే వాళ్లమని, ఇప్పుడు దూరంగా ఉండే డిపోలకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిరీక్షించక తప్పదని వాపోతున్నారు.

సర్వర్ల మొరాయింపు.. విసిగిపోయిన జనం

తూర్పులోని ఆరిలోవ, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, రవీంద్రనగర్, ఆదర్శనగర్, దారపాలెం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ తదితర ప్రాంతాల్లోని అన్ని రేషన్ డిపోల్లో టెక్నికల్ సమస్యలతో సర్వర్లు మొరాయించాయి. దీంతో గంటల తరబడి రేషన్ కోసం లబ్ధిదారులు నిరీక్షించాల్సి వచ్చింది. మళ్లీ ఇదేమి కర్మరా బాబూ అంటూ జనం విసిగిపోయారు. ఇంటి వద్దకు వచ్చిన రేషన్ బండిని కాదని.. డిపోలకు రమ్మంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క రేషన్ డిపోల్లో సర్వర్లు మొరాయించడంతో జనం క్యూలో విసిగిపోతుంటే.. మరోపక్క కూటమి నాయకులు రేషన్ సరకులు ఇవ్వడం ప్రారంభించి హంగామా చేసుకుపోయారు. సర్వర్లు పనిచేయకపోయినా.. సరకులు పంపిణీ చేస్తున్నట్లు ఫొటోలకు పోజులివ్వడంపై క్యూలో నిరీక్షించిన జనం నవ్వుకున్నారు.

టీడీపీ మహిళా కార్యకర్తల గొడవ

ఆరిలోవ: రేషన్ డిపోల వద్ద సరకుల పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో ఫొటోల కోసం టీడీపీ శ్రేణులు గొడవలకు దిగడం విశేషం. 13వ వార్డులోని పలు డిపోల వద్ద టీడీపీ నాయకులు ఫొటోలకు ఎగబడ్డారు. వారిలో ఇద్దరు మహిళా కార్యకర్తలు గొడవకు దిగారు. వార్డులో ఎప్పటి నుంచో గ్రూపులు నిర్వహిస్తున్న మజ్జి రమణి, నల్లాని వరలక్ష్మి రేషన్ డిపో వద్ద ఫొటోల కోసం ముందుకు దూసుకుపోవడానికి ఎవరికివారే ప్రయత్నించారు. నేను ముందుకెళ్తానంటే.. నేనే ముందుకెళ్తానంటూ ఒకర్నొకరు తోసుకున్నారు. దీంతో ఇద్దరూ మాటల యుద్ధంలో మునిగిపోయి దూషించుకొని నెట్టుకొంటూ ముందుకు దూసుకుపోయారు. ప్రోటోకాల్ ప్రకారం ముందుండాల్సిన వార్డు కార్పొరేటర్(ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి మారారు) కెల్ల సునీతను ఇద్దరు కలిసి వెనక్కి నెట్టేసి ఫొటోలు దిగడం విశేషం. వీరి చేష్టలను చూసి రేషన్ సరకుల కోసం వెళ్లినవారు, స్థానికులు ముక్కున వేలేసుకున్నారు.

రేషన్ డిపోల వద్ద పడిగాపులు

ఎంవీపీకాలనీ: స్థానిక రేషన్ డిపోల వద్ద తొలి రోజే లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. అప్పుఘర్‌లోని 0387201 డిపో వద్ద రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ డిపోను పసుపుమయంగా తీర్చిదిద్దడం, వివరాల పట్టికతోపాటు పసుపు తోరణాలు, పసుపు ఫ్లెక్సీలతో పెద్ద ఎత్తున అలంకరించడంపై అంతా ముక్కన వేలేసుకున్నారు. డిపో వద్ద సర్వర్ మొరాయించడంతో రేషన్ పంపిణీ నత్తనడకన సాగింది. రాత్రి 9 గంటల వరకు డిపో ఎదుట లబ్ధిదారులు బారులు తీరారు.

ఉదయం నుంచి మొరాయింపే..

ఎంవీపీ సెక్టార్-2లోని 0387216 రేషన్ డిపో వద్ద ఆదివారం ఉదయం 7 గంటల నుంచే లబ్ధిదారులు క్యూకట్టారు. వేలిముద్రలు నమోదు చేసే సర్వర్ మొరాయించడంతో 10 గంటల వరకు ఒక్కరికీ కూడా రేషన్ అందలేదు. చంటి పిల్లలతో వచ్చిన లబ్ధిదారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వృద్ధులు అవస్థలకు గురయ్యారు. గత ఐదేళ్లలో రేషన్ పంపిణీ సజావుగా సాగగా.. మళ్లీ పాత కష్టాలు ఎదురవ్వడంతో కూటమి ప్రభుత్వం తీరుపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు. ఈ డిపోను సైతం పసుపు తోరణాలు, ఫ్లెక్సీలతో పెద్ద ఎత్తున అలంకరించడంపై అంతా విమర్శలు గుప్పించారు.

మండుటెండలో నిరీక్షణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలోని రేషన్ డిపో 204 వద్ద పితాపురం కాలనీ, శివాజీపాలెం, పీతలవానిపాలెం తదితర ప్రాంతాల లబ్ధిదారులు ఉదయం నుంచి రాత్రి వరకు సరకుల కోసం పడిగాపులు కాశారు. బయోమెట్రిక్ మిషన్‌లు పనిచేయకపోవడంతో మండుటెండలో నిరీక్షించాల్సి వచ్చిందని వృద్ధులు, మహిళలు అసహనం వ్యక్తం చేశారు. గతంలో ఎంచక్కగా ఇంటి వద్దకు రేషన్ బండి వచ్చేదని, ఇప్పుడు ఏం దగా చేద్దామని రేషన్ డిపోల వద్ద సరకుల పంపిణీ ప్రారంభించారని పలువురు లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. రేషన్ వాహనం వద్ద ఎలక్ట్రికల్ డిజిటల్ కాటాపై బియ్యం కొలత గ్రాము తగ్గకుండా సరిగ్గా ఉండేదని, డిపోల వద్ద ఇష్టానుసారంగా కొలతలు వేసి బియ్యం, సరకులు నొక్కేసేందుకు కూటమి ప్రభుత్వం వీలు కల్పించడం దారుణమంటూ మండిపడుతున్నారు.

రేషన్ కోసం పరుగులు



రేషన్ కోసం డిపో వద్దకు పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఇంత వరకు రేషన్ బండే మా ఇళ్ల వద్దకు వస్తే సరకులు తీసుకునేవాళ్లం. ఈ విధానాన్ని రద్దు చేసి తప్పుచేశారు. ఎవరి లబ్ధి కోసం డిపోల వద్దే మళ్లీ రేషన్ పంపిణీ చేస్తున్నారో తెలియడం లేదు.

– పి.కృష్ణమ్మ, పీతలవానిపాలెం

సజావుగా కానిస్టేబుల్ రాత పరీక్ష



ప్రిజమ్ కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

సీతంపేట: కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా సాగింది. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీకాస్యప్, ప్రిజమ్ కళాశాల, వీటీ హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. ప్రిజమ్ కళాశాలలో 696 మందికి 622 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా.. వీటీ హైస్కూల్‌లో 463 మందికి 442 మంది, శ్రీకాశ్యప్ కళాశాలలో 480 మందికి 427 మంది హాజరయ్యారు. ద్వారకా పోలీసుల బందోబస్తు మధ్య పరీక్ష సజావుగా జరిగింది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్‌ఐ చిన్నం నాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి గొడవలు, కొట్లాటల్లో తలదూర్చ కూడదని, మంచిగా నడుచుకుని, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని రౌడీషీటర్లను ఎస్‌ఐ హెచ్చరించారు.